


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 13-02-2026 | సంపుటి - 26 | సంచిక -265 | రూ : 4 | పేజీలు: 8


## పార్లమెంట్‌పై సమ్మె ప్రభావం



2లో

- లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళన
- లోక్‌సభ చర్చలో భారత్‌బంద్ ప్రాముఖ్యతను వివరించిన ప్రతిపక్ష సభ్యులు
- చరిత్రలో అతిపెద్ద కార్మిక వ్యతిరేక ప్రభుత్వంగా మోడీ సర్కార్ : సీపీఐ(ఎం) ఎంపీ కె. రాధాకృష్ణన్



## అంతర్జాతీయ ప్రమాణాలతో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మించండి

- మూసీ ప్రాజెక్టుకు 100 ఎకరాలు బదలాయించండి
- గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి రండి
- కేంద్ర నిధులతో కృష్ణా – వికారాబాద్ రైలు మార్గం నిర్మించండి
- హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టులకు 500 ఎకరాలు కేటాయిస్తాం
- 18 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు ధాన్యం తీసుకోండి
- యాసంగి ధాన్యం సేకరణ గడువు రెండు నెలలు పొడిగించండి
- :కేంద్ర మంత్రులకు సీఎం వినతి


2లో

## చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ పై సీసీఐ కొరడా

- ఇంటెల్‌పై రూ.27.38 కోట్లు జరిమానా విధించిన సీసీఐ
- వివక్షాపూరిత వారెంటీ పాలసీని అమలు చేసినందుకు ఈ చర్య
- భారత్‌లో కొన్న మైక్రోప్రాసెసర్లకే వారెంటీ వర్తించేలా విధానం
- ఈ పాలసీ వినియోగదారుల ఎంపికను పరిమితం చేసిందని గుర్తింపు

2లో




## నేడు మున్సిపోల్స్ కౌంటింగ్

- ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- రాష్ట్రవ్యాప్తంగా 123 కేంద్రాల ఏర్పాటు
- రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడి

హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,996 వార్డుల ఓట్ల లెక్కింపుకు ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న లెక్కింపు కోసం 123 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 10 వేల మంది సిబ్బంది లెక్కింపులో పాల్గొంటారు. మున్సిపాల్టీ, తరువాయి 2లో

## రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి.. సభలో ఎంపీ నోటీసు

- అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్ పై రాహుల్ ఆరోపణలు
- నరవణె బుక్ పై మాట్లాడకుండా అడ్డుకుంటోందని ప్రభుత్వంపై విమర్శలు
- దేశాన్ని అమ్మేశారన్న రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీల ఆగ్రహం



2లో

## కాసు బ్రహ్మానంద రెడ్డి ఆనవాళ్లు ఇంకా ఉండటం బాధాకరం



2లో

- ఇక్కడ కలుసుకోవడం సిగ్గుగా ఉంది..
- ఆ గుర్తులు ఇంకా ఉండడం బాధగా ఉంది..
- బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులకు అవమానం..
- జయశంకర్, గద్దర్, సుద్దాల విగ్రహాలు ఎక్కడ..?
- కేసులు ఉన్నవారే ఉద్యమకారులా..?
- 2014 నుంచి నిరుద్యోగులకు అన్యాయమే..!
- ఉద్యమకారుల కోసం మరో ఉద్యమం
- మాది ఫక్తు రాజకీయ పార్టీ కాదు
- ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు



## ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం..

- మహిళలతో ప్రత్యేక వింగ్: ఐరాస సంచలన నివేదిక
- నవంబర్ 9 నాటి దాడిలో 15 మంది మృతి చెందినట్లు వెల్లడి
- మహిళలతో ప్రత్యేక ఉగ్రవాద విభాగాన్ని ఏర్పాటు చేసిన మసూద్ అజార్
- జైషే నిర్వీర్యమైందన్న పాక్ వాదనను తోసిపుచ్చిన ఐరాస నివేదిక

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జేఈఎం) ఉగ్రవాద సంస్థపై ఐక్యరాజ్యసమితి (యూఎన్) సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రదాడి వెనుక జైషే హస్తం ఉందని, ఆ సంస్థ మహిళలతో ప్రత్యేకంగా ఒక ఉగ్రవాద తరువాయి 2లో

## జర్నలిస్టులకు 44 వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు



- అర్హులందరికీ న్యాయం చేస్తాం..
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ

హైదరాబాద్ : రాష్ట్రంలోని జర్నలిస్టులకు శుభవార్త. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక, సీఎం సీపీఆర్వో మల్సూర్‌లతో మంత్రి పొంగులేటి సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. అక్రిడిటేషన్ కార్డులను పారదర్శకంగా జారీ చేయాలని ఆదేశించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని తరువాయి 2లో

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన బండ్ల గణేశ్...

- చంద్రబాబు సీఎం కావాలని మొక్కుకుని తిరుమలకు పాదయాత్ర చేసిన బండ్ల గణేశ్
- 23 రోజుల్లో 535 కిలోమీటర్ల మేర సాగిన సంకల్ప యాత్ర
- మొక్కు చెల్లించుకున్న అనంతరం సీఎంకు శ్రీవారి ప్రసాదం అందజేత
- పాదయాత్ర అనుభవాలను ముఖ్యమంత్రితో పంచుకున్న బండ్ల గణేశ్



2లో

# అంతర్జాతీయ ప్రమాణాలతో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మించండి

న్యూఢిల్లీ : తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌కు సమీపంలో నిర్మించనున్న మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి గురువారం కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, రాజ్‌నాథ్ సింగ్, అశ్వినీ వైష్ణవ్, ప్రహ్లాద్ జోషీలను కలిసి రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు విజ్ఞప్తులు అందజేశారు. పార్లమెంట్‌లో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిని ఆయన ఛాంబర్‌లో సీఎం కలిశారు.సీఎం వెంట ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, గడ్డం వంశీకృష్ణ, రామసహాయం రఘురాంరెడ్డి, డాక్టర్ కడియం కావ్య, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ కె.ఎస్.శ్రీనివాస రాజు, సీఎం సెక్రెటరీ మాణిక్ రాజ్, కేంద్ర పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు. దాదాపు అరగంటకు పైగా సాగిన ఈ భేటీలో... మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన భూసేకరణ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. మామునూరు విమానాశ్రయంలో కార్గో సేవలతోపాటు మెయింటెనెన్స్ ఓవర్‌హాల్ రిపేర్ (ఎంఓఆర్) సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. జౌళి, ఇతర పరిశ్రమలతో వరంగల్ నగరం పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందనీ, వరంగల్‌కు దగ్గరలో రెండేండ్లకోసారి ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్కసారక్క జాతర మేడారంలో జరుగుతుందని గుర్తు చేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ వరంగల్‌తోపాటు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, కరీంనగర్ జిల్లాలకు కేంద్రంగా ఉంటుందని వివరించారు. అలాగే, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఆ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు అదనంగా అవసరమైన 249.82 ఎకరాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మామునూరు విమానాశ్రయం పనుల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను అక్కడకు పంపిస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు.

*** కేంద్ర నిధులతో కృష్ణా-వికారాబాద్ రైలు మార్గం నిర్మించండి**

అనంతరం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఆయన ఛాంబర్‌లో సీఎం కలిశారు. కృష్ణావికారాబాద్ రైలు మార్గాన్ని పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ వ్యయం మొత్తాన్ని తామే భరిస్తామని మరోసారి గుర్తు చేశారు. కృష్ణావికారాబాద్ రైలు మార్గంలోని టేకల్‌కోడ్‌లో లైమ్‌స్టోన్ నిక్షేపాలను గుర్తించామని.. సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా దానిని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నామని తెలిపారు. అలాగే, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంతో పాటు కర్నాటకలోని పలు సిమెంట్ పరిశ్రమలకు సమీపంలో కృష్ణా ప్రాంతం ఉందన్నారు. కొడంగల్, టేకల్‌కోడ్, దౌల్తాబాద్‌లను పారిశ్రామిక జోన్లుగా అభివృద్ధి చేస్తున్నట్టు సీఎం వివరించారు.

*** 100 ఎకరాల భూములు బదలాయించండి**

అంతకు ముందు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు 100 ఎకరాలు బదలాయించాలని కోరారు. ఈసా.. మూసీ నదుల సంగమ స్థలిలో ప్రపంచస్థాయి విద్యా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ కేంద్రంగా నిర్మించనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన ప్రోగ్రాంకు రావాలంటూ కేంద్రమంత్రిని ఆయన ఆహ్వానించారు. సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యాలతో పర్యావరణ హితంగా, స్వచ్ఛమైన నీటితో నది ప్రవహించేలా మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపడుతున్నట్టు వివరించారు.

# పార్లమెంట్‌పై సమ్మె ప్రభావం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా సమ్మె చేస్తున్న కార్మికుల ఆగ్రహం.. పార్లమెంటులో కూడా ప్రతిధ్వనించింది. కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ లోక్‌సభలో ప్రవేశపెట్టిన పారిశ్రామిక నియమావళి సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడిన ప్రతిపక్ష సభ్యులందరూ కార్మికులను అఖిల భారత సమ్మెకు దారితీసిన పరిస్థితులను ప్రస్తావించారు. కార్మికులను సమ్మె చేయొద్దని బ్రిటీష్ పాలకులు బలవంతం చేశారని గుర్తు చేశారు. ఇపుడు దేశంలోని కార్మికవర్గం పోరాటాలతో సాధించుకున్న హక్కులను తొలగించడానికి మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను సీపీఐ(ఎం) లోక్‌సభాపక్ష నేత కె. రాధాకృష్ణన్ ఉటంకించారు. "ప్రస్తుత కార్మిక అనుకూల చట్టాలన్నింటినీ తారుమారు చేయడంతో కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను తీసుకువచ్చింది. ఈ చర్యతో.. మోడీ ప్రభుత్వం చరిత్రలో అతిపెద్ద కార్మిక వ్యతిరేక ప్రభుత్వంగా మారింది. దేశంలోని రైతులు, కార్మికులందరూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి తమ హక్కులను సాధించుకున్నారు. రైతులు, కార్మికులు 'సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని' మోకాళ్లపైకి తీసుకురాగలిగారు. అలాంటి వారసత్వం ఉన్న వారు తప్పకుండా మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించగలరు. మోడీ సర్కార్ తప్పులను కూడా సరిదిద్దగలరు" అని కె. రాధాకృష్ణన్ అన్నారు. సార్వత్రిక సమ్మెతో కార్మికులు, రైతులు లేవనెత్తిన డిమాండ్లు ఈ దేశంలోని ప్రతి పౌరుడి హక్కులకు సంబంధించినవని సీపీఐ(ఎం) రాజ్యసభాపక్షనేత జాన్‌బ్రిట్టాస్ గుర్తు చేశారు. సమ్మెలో ఉన్న కోట్లాది మంది కార్మికులు, రైతులకు సంబంధించి సభ జీరో అవర్‌లో సమ్మె ముఖ్యమైన డిమాండ్లను లేవనెత్తారు. "సమ్మెలో బీఎంఎస్ మినహా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొన్నాయి. బీఎంఎస్ కూడా కార్మిక కోడ్‌లకు వ్యతిరేకం గా నిరసన తెలుపుతోంది. అందువల్ల బీఎంఎస్‌తో సంబంధం ఉన్న ఉద్యోగులు కూడా సమ్మెలో పాల్గొన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసింది" అని ఆయన విమర్శించారు. లోక్‌సభలో మాట్లాడుతూ... సుప్రీ యాసూలే, రాణి శ్రీకుమార్, అరవింద్ సావంత్, కోడికున్నిల్ సురేశ్, ఈటి ముహమ్మద్ బషీర్ వంటి సభ్యులు కూడా అఖిల భారత సమ్మె ప్రాముఖ్యతను వివరించారు.

**ట్రేడ్ డీల్‌పై రాహుల్ తీవ్ర విమర్శలు**

అమెరికా భారత్ ట్రేడ్ డీల్ గురించి రాహుల్‌గాంధీ బుధవారం లోక్‌సభలో తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందంతో దేశ ప్రయోజనాలను పూర్తిగా అమెరికాకు తాకట్టు పెట్టారని, దేశాన్ని అమ్మేశారని ఆయన ఆరోపించారు. ఈ ట్రేడ్ డీల్‌ను రాహుల్ గాంధీ 'పూర్తి లొంగుబాటు'గా అభివర్ణించారు. దేశ ఇంధన భద్రతను అమెరికాకు అప్పగించారని, రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డారని ఆరోపించారు. రాహుల్ గాంధీ ప్రసంగంపై బీజేపీ ఎంపీలు విమర్శించారు. అయితే రాహుల్‌గాంధీ బుధవారం చేసిన ప్రసంగం నుంచి కొన్ని వ్యాఖ్యలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

**ఏమిటీ సబ్‌స్టాంటివ్ మోషన్?**

సబ్‌స్టాంటివ్ మోషన్ అనేది పార్లమెంటు సభ్యుడు ఒక నిర్దిష్ట అంశంపై తన స్వంత అభిప్రాయాన్ని లేదా సిఫారసును సభ ఆమోదం కోసం సమర్పించడానికి ఉపయోగించే విధానం. సబ్‌స్టాంటివ్ మోషన్‌కు వివరణాత్మక చర్చ అవసరం. ఆపై ఓటుతో మెజారిటీ నిర్ణయం అవసరం ఉంటుంది. స్పీకర్ ఆమోదం పొందితే ఈ మోషన్‌ను సభలో ప్రవేశపెట్టవచ్చు. స్పీకర్ దానిని ఆమోదిస్తే, ఈ మోషన్‌పై చర్చ, ఓటింగ్ నిర్వహించవచ్చు. కొన్ని సందర్భాల్లో నోటీసులోని ఆరోపణలను నిపుణుల కమిటీ పరిశీలనకు వదిలివేస్తారు. అయితే మరోవైపు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.

**చిచ్చు రేపిన నవరణే పుస్తకం**

ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణే పుస్తకంలోని వివాదాస్పద అంశాలను సభలో చదివి వినిపించాలనే రాహుల్ గాంధీ ప్రయత్నాన్ని బీజేపీ.. స్పీకర్ జోక్యంతో అడ్డుకుంది. ఆ తరువాత జరిగిన నిరసనల సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా కాంగ్రెస్ మహిళా ఎంపీలు ప్రధానిపై దాడికి ఒక పద్ధతి ప్రకారం ప్రయత్నించారని ఆరోపించారు. స్పీకర్ విశ్వసనీయత కోల్పోయారని పేర్కొంటూ ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టింది. దీని తరువాత, ఇప్పుడు రాహుల్‌ను అనర్హులుగా ప్రకటించాలని బీజేపీ ఎంపీ డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

# చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ పై సీసీఐ కొరడా

ఢిల్లీ: ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ కార్పొరేషన్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) భారీ జరిమానా విధించింది. బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్ల విషయంలో భారత్‌కు మాత్రమే ప్రత్యేకంగా అమలు చేసిన వారెంటీ పాలసీ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలడంతో, రూ.27.38 కోట్ల ఫైన్ వేసింది. మ్యాట్రిక్స్ ఇన్ఫో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన ఫిర్యాదుతో ఈ కేసు విచారణకు వచ్చింది. ఇంటెల్ 2016 ఏప్రిల్ 25 నుంచి భారత్‌లో కొత్త వారెంటీ పాలసీని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం, ఇంటెల్ అధీకృత భారతీయ డిస్ట్రిబ్యూటర్ల నుంచి కొనుగోలు చేసిన బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్లకు మాత్రమే ఇక్కడ వారెంటీ వర్తిస్తుంది. ఇతర దేశాల్లో కొన్న ప్రాసెసర్లకు భారత్‌లో వారెంటీ లభించదు. ఈ విధానంపై విచారణ జరిపిన సీసీఐ, డెస్క్‌టాప్‌ల కోసం ఉద్దేశించిన బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్ల మార్కెట్‌లో ఇంటెల్ ఆధిపత్య స్థానంలో ఉందని నిర్ధారించింది. చైనా, ఆస్ట్రేలియా, ఇతర దేశాల్లోని వారెంటీ పాలసీలతో పోలిస్తే, భారత్‌లో అమలు చేసిన విధానం వివక్షాపూరితంగా ఉందని అభిప్రాయపడింది. ఇది వినియోగదారుల ఎంపిక స్వేచ్ఛను పరిమితం చేయడంతో పాటు, ప్యారలల్ ఇంపోర్టర్లకు నష్టం కలిగించిందని పేర్కొంది. ఇది కాంపిటీషన్ యాక్ట్, 2002లోని సెక్షన్ 4ను ఉల్లంఘించడమేనని తేల్చింది. ఈ వివాదాస్పద పాలసీ ఎనిమిదేళ్ల పాటు అమల్లో ఉన్నందున, సంబంధిత టర్నోవర్‌పై 8 శాతం జరిమానా విధించాలని మొదట సీసీఐ భావించింది. అయితే, 2024 ఏప్రిల్ 1 నుంచి ఇంటెల్ ఈ పాలసీని స్వచ్ఛందంగా నిలిపివేయడం వంటి సానుకూల అంశాలను పరిగణనలోకి తీసుకుని, జరిమానా మొత్తాన్ని రూ.27.38 కోట్లకు తగ్గించింది. వివాదాస్పద వారెంటీ పాలసీని ఉపసంహరించుకున్న విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని, దీనిపై నివేదిక సమర్పించాలని ఇంటెల్‌ను సీసీఐ ఆదేశించింది.

# రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

ఢిల్లీ: లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్ సభలో బీజేపీ ఓ నోటీసును ఫైల్ చేసినట్లు సమాచారం. అయితే, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేయలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రసంగించిన విషయం తెలిసిందే. రాహుల్ తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్రం అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుందని, ప్రధాని మోదీ దేశాన్ని అమెరికాకు అమ్మేశాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్ లో చైనా ఆక్రమణ విషయం స్పష్టంగా ఉందని, ఆ విషయంపై సభలో మాట్లాడకుండా అధికార పక్షం తనను అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. ఈ ప్రసంగంపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు సభలోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రేడ్ డీల్ తో భారత్ కు ఎలాంటి నష్టం లేదని వివరించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ నోటీసు ఇచ్చారు.

# ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం.. మహిళలతో ప్రత్యేక వింగ్


ఢిల్లీ: పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జేఈఎం) ఉగ్రవాద సంస్థపై ఐక్యరాజ్యసమితి (యూఎన్) సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రదాడి వెనుక జైషే హస్తం ఉందని, ఆ సంస్థ మహిళలతో ప్రత్యేకంగా ఒక ఉగ్రవాద విభాగాన్ని కూడా ఏర్పాటు చేసిందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఐరాస భద్రతా మండలికి చెందిన ఆల్‌ఖైదా, ఐసిస్ ఆంక్షల పర్యవేక్షణ బృందం ఈ నివేదికను రూపొందించింది. 2025 నవంబర్ 9న ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన దాడిలో 15 మంది మరణించారని, ఈ ఘటనతో జైషే మహమ్మద్‌కు సంబంధం ఉన్నట్లు తమకు సమాచారం అందిందని పేర్కొంది. ఈ దాడితో పాటు మరికొన్ని దాడులకు జైషే బాధ్యత వహించినట్లు ఒక సభ్య దేశం తెలిపినట్లు నివేదికలో పొందుపరిచారు. అంతేకాకుండా జైషే చీఫ్, అంతర్జాతీయ ఉగ్రవాది మసూద్ అజార్ 2025 అక్టోబర్ 8న 'జమాత్ ఉల్‌ముమినత్' పేరుతో మహిళా విభాగాన్ని అధికారికంగా ప్రకటించినట్లు నివేదిక తెలిపింది. ఉగ్రవాద దాడులకు మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అయితే, ఈ నివేదికలో మరో ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. ఒక సభ్య దేశం (పాకిస్థాన్ అని భావిస్తున్నారు) మాత్రం జైషే సంస్థ ఎప్పుడో 'నిర్వీర్యం' అయిపోయిందని వాదించింది. నివేదికలో జైషే ప్రస్తావనపై పాకిస్థాన్ తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పాకిస్థాన్ వాదన ఎలా ఉన్నప్పటికీ, జైషే మహమ్మద్ ఇప్పటికీ చురుకుగా కార్యకలాపాలు సాగిస్తోందని, అంతర్జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమించిందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.



# కాసు బ్రహ్మానంద రెడ్డి ఆనవాళ్లు ఇంకా ఉండటం బాధాకరం

హైదరాబాద్ : ప్రాణ త్యాగాల పునాదుల మీద వెలిసిన తెలంగాణలో.. 369 మంది బిడ్డలను పొట్టనబెట్టుకున్న కాసు బ్రహ్మానందరెడ్డి ఆనవాళ్లు ఇంకా ఉండటం బాధాకరమని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. త్వరలోనే రాజకీయ పార్టీ పెట్టబోతున్నామని తెలిపారు. మాదీ ఫక్తు రాజకీయ పార్టీ కాదు.. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే పార్టీ అని కవిత పేర్కొన్నారు. హైదాబాద్ ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కవిత పాల్గొని ప్రసంగించారు. ఫిబ్రవరి 12 న మనమంతా ఇలా చారిత్రక ప్రాంతమైన ఆర్టీసీ కళ్యాణ మండపంలో కలుసుకోవటం కొంత సిగ్గుగా, కొంత సంతోషంగా ఉంది. తెలంగాణకు వ్యతిరేకంగా సమైక్యవాదులు ఒక్కటైతే ఇదే చోట మనంతా తెలంగాణ జేఏసీగా ఏర్పాటయ్యాం. ఆ తర్వాత మనం తెలంగాణను సాధించుకున్నాం. కానీ మళ్లీ ఒకసారి ఉద్యమకారుల కోసం ఒక అడుగు ముందుకు వేసేందుకు ఇక్కడ కలుసుకున్నాం. నిజానికి రాష్ట్రం రాగానే ఉద్యమకారులందరికీ మొదటి వరుసలోనే గౌరవం, ఆర్థిక వృద్ధి, రాజకీయ అవకాశాలు వస్తాయని భావించాం. కానీ ఆ విధంగా జరగకపోవటం చాలా బాధ కలిగించే అంశం. మన తెలంగాణ అనేది నిత్యం పోరాటాల గడ్డనే. మానవాళి పుట్టినప్పటికీ నుంచి మన గడ్డకు ఎంతో చరిత్ర ఉంది. తెలంగాణలో పుట్టినందుకు గర్వపడుతున్నా. ఎన్ని జన్మలు ఉన్న సరే మళ్లీ తెలంగాణలోనే పుట్టాలని కోరుకుంటున్నా. మన నేలకు పునీతమైన, పురాతనమైన చరిత్ర ఉంది అని కవిత పేర్కొన్నారు.

# జర్నలిస్టులకు 44 వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు



హైదరాబాద్:రాష్ట్రంలోని జర్నలిస్టులకు శుభవార్త. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక, సీఎం సీపీఆర్వో మల్సూర్‌లతో మంత్రి పొంగులేటి సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. అక్రిడిటేషన్ కార్డులను పారదర్శకంగా జారీ చేయాలని ఆదేశించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందన్నారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు.

**అక్రిడిటేషన్ కార్డులు జారీ ఇలా..**

2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర, జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ, మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# నేడు మున్సిపోల్స్ కౌంటింగ్

హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,996 వార్డుల ఓట్ల లెక్కింపుకు ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న లెక్కింపు కోసం 123 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 10 వేల మంది సిబ్బంది లెక్కింపులో పాల్గొంటారు. మున్సిపాల్టీ, కార్పొరేషన్లలోని వార్డుల సంఖ్య ఆధారంగా 15 నుంచి 35 వరకు టేబుళ్లను ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్‌పై జరుగుతున్న లెక్కింపు ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి మానిటరింగ్ చేయనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. పోటీలో ఉన్న రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌లను తెరుస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల వారీగా 25 చొప్పున బెండల్స్ కడతారు. అనంతరం వాటిని లెక్కిస్తారు. తొలి ఫలితం మధ్యాహ్నం 12 గంటల వరకు వస్తుందని భావిస్తున్నారు.

**పరోక్ష ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల**

తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికకు గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి 16న సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం అదే రోజు ఎన్నిక నిర్వహిస్తామని పేర్కొంది.

# సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్ గా జి. సృజన బాధ్యతలు

* **నూతన కమిషనర్ను కలిసిన ఎమ్మెల్యే,తాజా మాజీ కార్పొరేటర్లు**



సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి : నూతనంగా ఏర్పాటైన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్గా ఐఏఎస్ అధికారి జి. సృజన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాదాపూర్ లోని న్యాక్ భవనంలోని సైబరాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయంలో పీఏసీ చైర్మన్,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, భాస్కర్, కృష్ణ రెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా నూతనంగా ఏర్పాటైన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు తొలి కమిషనర్గా ఐఏఎస్ అధికారి జి. సృజన బాధ్యతలు స్వీకరించిన శుభసందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెరుగైన మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధిపై సైబరాబాద్ కమీషనర్ సృజన ప్రత్యేక దృష్టి సారించిన్నట్లు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో నెలకొన్న పలు సమస్యలు , చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన తో చర్చించారు. పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని , అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. పనులలో వేగం పెంచి సకాలంలో నిధులు మంజూరు అయ్యేలా చూడలన్నారు. అభివృద్ధి పనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలన్నారు. ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని, చెరువుల సుందరికరణ, పార్క్ ల అభివృద్ధి పనులలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు కు కృషి చేయాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.దీని పై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన సానుకూలంగా స్పందించారు.

## రాజన్న ఆశయాల సాధనకు కట్టుబడి ముందుకు సాగుదాం

**: బండారి నీలం రెడ్డి**




ప్రజాస్ఫూర్తి , కాప్రా :దివంగత నేత, ఉప్పల్ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి జయంతి సందర్భంగా చక్రిపురం చౌరస్తాలో అభిమానులు, శ్రేయోభిలాషులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజిరెడ్డి మున్సిపల్ చైర్మన్గా, ఉప్పల్ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా, అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా ప్రజలకు విశేష సేవలు అందించిన గొప్ప నాయకుడని కొనియాడారు. పీడిత, బాధిత ప్రజలకు అండగా నిలిచి వారి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత అని పేర్కొన్నారు.రాజన్న ఆశయాలను సాధించే దిశగా అడుగులు వేయాలని బండారి నీలం రెడ్డి పిలుపునిచ్చారు. "రాజన్న అమర్ హై", "జోహార్ రాజన్న" అంటూ అభిమానులు నినాదాలు చేశారు.పార్టీలకు అతీతంగా తరలివచ్చిన అభిమానులు, శ్రేయోభిలాషులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

## మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ను కలిసిన పత్తి కుమార్




ప్రజాస్ఫూర్తి , కాప్రా : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డిని మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు, కాప్రా ఉమ్మడి డివిజన్ కాంగ్రెస్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పత్తి కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పత్తి కుమార్ కమిషనర్కు భోకే అందజేసి సత్కరించారు. నగరాభివృద్ధి, కాలనీ సమస్యలు , ప్రజలకు మెరుగైన సేవలందించే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పరస్పర సహకారం అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సింగం కిరణ్, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిర్మించిన భవనాలను సీజ్ చేసిన అధికారులు




మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి జిహెచ్ఎంసి సర్కిల్ 5 పరిధిలోని గౌతమ్ నగర్, నరసింహ రెడ్డి నగర్,పివిఎన్ కాలనీ లలో జిహెచ్ఎంసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన పలు భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారి ఏసిపి శ్రీనివాసరావు వారి బృందంతో కలిసి ప్లాన్లకు విరుద్ధంగా అనధికారికంగా చేపట్టిన భవన నిర్మాణాలను యు/ఎస్ 461ఎ ఆఫ్ జిహెచ్ఎంసి ఆ 1955 కింద నిర్మాణాలకు బ్యానర్ లను ఏర్పాటు చేసి సీజ్ చేసినట్లు టౌన్ ప్లానింగ్ అధికారుల తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## కల్తీ కోవా స్థావరాలపై టాస్కోఫ్ర్స్ దాడి.. ఇద్దరు అరెస్టు

తాండూర్ , (ప్రజాస్ఫూర్తి ) : తాండూరులో కల్తీ కోవా స్థావరాలపై టాస్కోఫ్ర్స్ దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపిన వివరాల ప్రకారం...... రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ప్రకాష్ విష్ణు , చాంద్రాయణగుట్ట కు చెందిన మహ్మద్ సల్మాన్ లు అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ కల్తీ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారని సమాచారం అందుకున్న టాస్కోఫ్ర్స్ పోలీసులు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఇన్స్పెక్టర్ మహ్మద్ అన్వర్ పాషా నాయకత్వంలోని టాస్కఫోర్స్ బృందం తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో సుమారు 120 కిలోల కల్తీ కోవాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు స్వాధీనం చేసుకున్న కల్తీ కోవాతో పాటు నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం తాండూరు పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత

* **మూడు మున్సిపాలిటీల్లో 163 బీఎన్ఎస్ఎస్ అమలు**
* **సభలు, ర్యాలీలకు అనుమతి లేదు: ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. శుక్రవారం జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల నియమావళి ప్రకారం సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అలాగే డీజేలు వినియోగం, బాణాసంచా కాల్చడం పూర్తిగా నిషేధమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.స్ట్రాంగ్ రూంల వద్ద ప్రత్యేక భద్రత కల్పించడంతో పాటు కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ బృందాలతో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో పకడ్బందీగా 163 బీఎన్ఎస్ఎస్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్కు హాజరయ్యే అభ్యర్థులు, ఏజెంట్లు అగ్గిపెట్టెలు, లైటర్లు, ఇంక్ బాటిల్స్, పేలుడు పదార్థాలు వంటి నిషేధిత వస్తువులను కేంద్రాల్లోకి తీసుకురాకూడదని సూచించారు. పోలీసుల తనిఖీలకు సహకరించాలని కోరారు. ఎన్నికల అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డులు ఉన్న వారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లో ప్రవేశం ఉంటుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసిన తాజా మాజీ కార్పొరేటర్



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : వివేకానంద నగర్ డివిజన్ నుంచి బిఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చి కార్పొరేటర్ గా గెలిపించి ప్రజలకు సేవ చేసుకునే అవకాశం ఇచ్చినందుకు గురువారం కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు తో కలిసి తాజా మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తాజా మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు మాట్లాడుతూ వివేకానంద నగర్ డివిజన్ నుండి కార్పొరేటర్ గా గెలిపించి ఐదు సంవత్సరాల కాలంలో డివిజన్ అభివృద్ధిలో సహకరించిన నాయకులకి, కార్యకర్తలకి, ప్రజలకు, అధికారులకి మీడియా సోదరులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజా సేవలో ముందుంటానని అన్నారు.

## మేయర్ కుర్చీ ఎవరికో..?



* **'గూడెం' కార్పొరేషన్లో త్రిముఖ పోరు**
* **కాంగ్రెస్కు అనుకూలంగా ఎగ్జిట్ పోల్స్**
* **మెజారిటీ రాకపోతే కాంగ్రెస్, సీపీఐ చేతులు కలిపేనా..?**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్కు తొలిసారిగా జరిగిన ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. తొలి పీఠాన్ని దక్కించుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి. తమ పార్టీయే మేయర్ పీఠం కైవసం చేసుకుంటుందని ఆయా పార్టీలు ధీమా వ్యక్తం చేస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్లో కలిపి మొత్తం 60 డివిజన్లు ఉండగా, అందులో 31 డివిజన్లు గెలిచిన పార్టీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునే అవకాశం ఉంది. అయితే కార్పొరేషన్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, బీజేపీ, జనసేన పార్టీలు ఎలాంటి పొత్తులు లేకుండా పోటీ చేయగా, కొన్నిచోట్ల లోపాయికారి పొత్తులతో అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరితోపాటు కొందరు బలమైన స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీలు శక్తి సామర్థ్యాలను వినియోగించాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియగా, ప్రస్తుతం అందరి దృష్టి ఓట్ల లెక్కింపుపై కేంద్రీకృతమైంది. మధ్యాహ్నం నాటికి ఫలితాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు భావిస్తున్నారు.

* **కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఎగ్జిట్ పోల్స్**

ఎన్నికలు ముగిసిన అనంతరం వచ్చిన ఎగ్జిట్ పోల్స్లో అధికార కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వస్తుందని ప్రకటించాయి. అయితే సీపీఐ సైతం ఈ ప్రాంతాల్లో బలంగా ఉన్న నేపథ్యంలో గట్టి పోటీనిచ్చే అవకాశం లేకపోలేదు. అంతేకాకుండా బీఆర్ఎస్ కూడా ప్రభుత్వ వ్యతిరేక ఓటును రాబట్టడంలో సఫలీకృతమైందని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నారు. కొన్ని డివిజన్లలో మద్యం, డబ్బులు ప్రభావం చూపాయని, అక్కడి ఓటర్లకు అభ్యర్థులు ఎక్కువ మొత్తంలో డబ్బులు ఆశ చూపించి తమకు ఓట్లు వేయించుకున్నారనే ఆరోపణలున్నాయి. అంతే కాకుండా ఈ సారి బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించడంతో కొంతవరకు క్రాస్ ఓటింగ్ కూడా జరిగి ఉండవచ్చునని ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా తొలి మేయర్ పీఠం ఎవరు దక్కించుకుంటారనే ఉత్కంఠకు నేడు తెరపడనుంది.

* **మెజారిటీ రాకపోతే కాంగ్రెస్, సీపీఐ చేతులు కలిపేనా..?**

ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం రాకపోతే పరిస్థితి ఏమిటి అనే చర్చ కూడా కార్పొరేషన్ పరిధిలో విస్తృతంగా సాగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీలు పొత్తు పెట్టుకుని ఉండటం, సీఎం రేవంత్ రెడ్డి పలు సభల్లో ఎర్రజెండా పార్టీలను అభినందించడం చూసి ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రానిపక్షంలో కాంగ్రెస్ పార్టీ సీపీఐ వైపు చూస్తుందని ప్రజలు అనుకుంటున్నారు. అయితే మేయర్ పీఠం కాంగ్రెస్ తీసుకుని డిప్యూటీ మేయర్ పదవిని సీపీఐ ఆశించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఎన్నికల రోజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పోలీసులు అనుకూలంగా వ్యవహరించారని, ఇది ప్రభుత్వం పనేనంటూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరోక్ష వ్యాఖ్యలు చేయడం, ఈ రోజుతో ఇది అయిపోయింది, మా పార్టీ సత్తా ఏంటో చూపిస్తామని చెప్పడంతో కాంగ్రెస్ పార్టీతో సీపీఐ పొత్తు చెడిందేమోనని పలువురు చెప్పుకుంటున్నారు. అయితే రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదు అనే నానుడి ఉండటంతో అవసరమైతే మళ్లీ రెండు పార్టీలు కలుస్తాయని ఇంకొందరు భావిస్తున్నారు.

## రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన స్లేట్ ఎక్సలెన్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



ప్రజాస్ఫూర్తి, జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ బాట్ ప్లస్ ఈన్నోవిటి రోబోస్టిక్స్ ఛాంపియన్షిప్ లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా స్లేట్ ఎక్సలెన్స్ ఉన్నత పాఠశాల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించడం ఎంతో గర్వకారణం అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక రోబోటిక్స్ పోటీలలో అనేక పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నప్పటికీ తమ విద్యార్థులు ప్రతిభ, సృజనాత్మకత సాంకేతిక నైపుణ్యాలతో అందరినీ ఆకట్టుకుని రాష్ట్రంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు అని తెలిపారు. ఈ పోటీకి సంబంధించిన ఆన్లైన్ పరీక్ష జనవరి 10వ తేదీన నిర్వహించబడిందని, ఆ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో విజయం సాధించడం తమకు, తమ పాఠశాలకు ఎంతో గర్వకారణం అని తెలిపారు. రాష్ట్ర స్థాయి విజేతలైన 7 వ తరగతి చదువుతున్న శౌర్య, శ్రేయస్, వైభవ్ లకు రూ.5 వేల నగదు బహుమతి ని అందించారు.

**విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన**

ఏ.టి.ఎల్ ఈ, బాట్ ఇన్చార్జ్ శ్రావణి ని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ డా. ఏ. శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు షిరిన్ ఖాన్, ఉపాధ్యాయులు జాకీర్, అస్మా, తల్లిదండ్రులు అభినందించారు.

## కార్పోరేషన్ ఓటర్లు మన పక్షానే నిలిచారు




* **ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలి**
* **కార్పొరేషన్ అభ్యర్థులు, ఏజెంట్లకు దిశా నిర్దేసం చేసిన ఎమ్మెల్యే కూనంనేని**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కార్పోరేషన్ ఎన్నికల్లో ఓటర్లు మన పక్షానే నిలిచారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్సి కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం స్థానిక శేషగిరి భవన్ సిపిఐ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్పోరేషన్ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా పోటీచేసిన అభ్యర్థులతో పాటు కౌటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కౌటింగ్లో పూర్తి స్థాయి ఫలితాలు వెలువడేంత వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిక్లరేషన్ ఫాములు అందుకున్న తర్వాతే కౌంటంగ్ కేంద్రం నుండి బయటకు రావాలని, ఎటువంటి అనుమానాలు ఉన్నా వెంటనే రీకౌటంగ్ కోరాలని సూచించారు. కార్పోరేషన్ వ్యాప్తంగా సిపిఐ అభ్యర్థులే గెలవబోతున్నారని అన్నారు. కౌటింగ్కు సంబంధించి అనుబోస్ కాలేజీలో అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారని, కౌటింగ్ విషయం లో అనుసరించాలన్ని విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూనంనేని వివరించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా మాట్లాడుతూ అభ్యర్థితో పాటు ఏజెంట్సమయానికి కౌటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, బ్యాలెంట్ బాక్సుల ప్రధాన సీల్ సరిగా ఉందా లేదా అనే విషయాన్ని సరిచూసుకోవాలని చెప్పారు. అభ్యర్థితో పాటు కౌటింగ్ ఏజెంట్లు చాలా అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఇదే అని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, ఫయూమ్ దాదా, ధస్రు, విశంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, నాగుల్మీరా, కేశవులు, మనిగడప వెంకటేశ్వర్లు, పద్మ, పద్మజ, భూక్యా శ్రీను, అన్నారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను పాటించాలి

* మియాపూర్ ట్రాఫిక్ ఏసీపీ ఎం. ఆదిమూర్తి



మియాపూర్,ప్రజాస్పూర్తి : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మియాపూర్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక రహదారి భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మియాపూర్ ట్రాఫిక్ ఏసీపీ ఎం. ఆదిమూర్తి తో పాటు మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆర్. విద్యాసాగర్ రెడ్డి, ఎస్ఐ గాల్వ రాములు, ఏఎస్ఐ మల్లయ్య, సిబ్బంది ఆర్సీ పురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్ వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్న వాహనదారులను గుర్తించి ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా హెల్మెట్‌లు ధరించిన ద్విచక్ర వాహనదారులు, సరైన నంబర్ ప్లేట్లు, రియర్ వ్యూ మిర్రర్లు కలిగిన వాహనాలు, సీటుబెల్టులు వాడుతున్న వారిని పోలీసులు ఆపి అభినందించారు. అలాగే సరైన యూనిఫాంలో ఉన్న ఆటో డ్రైవర్లను కూడా ప్రశంసించారు.ట్రాఫిక్ నియమాలను బాధ్యతాయుతంగా పాటిస్తున్న వాహనదారులకు గులాబీ పువ్వులు అందజేసి ఏసీపీ అభినందనలు తెలిపారు. రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడం, నియమాలను స్వచ్ఛందంగా పాటించే పౌరులను ప్రోత్సహించడం ద్వారా సురక్షిత రవాణా సంస్కృతిని పెంపొందించడం లక్ష్యమని ఏసీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ ట్రాఫిక్ సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు.

## ఘనంగా బండారి రాజిరెడ్డి జయంతి వేడుకలు



ప్రజాస్పూర్తి , కాప్రా : కాప్రా డివిజన్‌లో భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో, కాప్రా ఎంఆర్వో కార్యాలయం వద్ద దివంగత నేత, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి 79వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. రాజిరెడ్డి ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన మహానేత అని కొనియాడారు. ఆయన చూపిన సేవా మార్గంలో నడుస్తూ ప్రజలకు అంకితభావంతో సేవ చేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మోకిల తండా గ్రామ సర్పంచ్ శాంతమ్మ సస్పెన్షన్ ను ఎత్తివేయాలి

* కలెక్టర్ కు భారతీయ గోర్ బంజారా పోరాట సమితి వినతి



శంకర్ పల్లి, ప్రజాస్పూర్తి : మోకిల తండా గ్రామ సర్పంచ్ శాంతమ్మ సస్పెన్షన్ ను ఎత్తివేయాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి గురువారం కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. శంకర్‌పల్లి మండలం మోకిల తండా గ్రామ సర్పంచ్ శాంతమ్మని ఎటువంటి సముచిత కారణం లేకుండా సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం పట్ల భారతీయ గోర్ బంజారా పోరాట సమితి తీవ్రంగా ఖండించింది. శాంతమ్మ ఇటీవలే ఎన్నికై మూడు నెలలు కూడా పూర్తి కాకముందే పరిపాలనా బాధ్యతలు నిర్వర్తించే అవకాశాన్ని ఇవ్వకుండా సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన (ఎస్టీ) మహిళగా ఎన్నికైన ప్రజాప్రతినిధిని ఈ విధంగా వ్యవహరించడం గిరిజన సమాజానికి అవమానకరంగా ఉందన్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర నిధుల వినియోగంపై సరైన విచారణ లేకుండానే ఈ చర్య తీసుకున్నారని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. అందువల్ల ఈ సస్పెన్షన్‌ను తక్షణం ఉపసంహరించి, ఆమెను మళ్లీ సర్పంచ్ హోదాలో కొనసాగించేలా తగిన ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా కలెక్టర్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ అంశంపై సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ తదితరులకు లిఖితపూర్వకంగా వినతి పత్రాలను అందజేస్తామని చెప్పారు. అవసరమైతే సంబంధిత జాతీయ మానవ హక్కుల సంఘం, ఎస్సీ,ఎస్టీ కమిషన్ తదితర అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లడానికి మా సమితి సిద్ధంగా ఉంది. కలెక్టర్ ఈ విషయాన్ని సమగ్రంగా పునఃపరిశీలించి, న్యాయపరమైన విచారణ చేసి, సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయవలసిందిగా రాష్ట్ర సమితి తరపున విజ్ఞప్తి చేశారు.

# కన్‌సాన్‌పల్లి సిద్దేశ్వరుని ఆలయంలో పూజలు

* శేరి మాణిక్‌రెడ్డి, జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహణ

అందోలు, ప్రజాస్పూర్తి: అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన సిద్దేశ్వరుని ఆలయంలో గ్రామ మాజీ సర్పంచ్ శేరి మాణిక్‌రెడ్డి, జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యే పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ప్రతి సంవత్సరం శ్రావణమాసం మరియు మహా శివరాత్రి పండగల సందర్భంగా ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనావాయితీ వస్తోంది. మహా శివరాత్రి పండగ సందర్భంగా గురువారం గ్రామ పురోహితులు ఆనంద్ శర్మ మంత్రోచ్చరణమల మధ్య మాజీ సర్పంచ్ చేతుల మీదుగా గణపతి పూజ, శివలింగానికి పంచామృత అభిషేకం వంటి కార్యక్రమాలను జరిపించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాణిక్‌రెడ్డి మాట్లాడుతూ ఆ మహా శివుని యొక్క కృపా కటాక్షలు గ్రామ ప్రజలందరిపై ఉండడంతో పాటు పాడి పంటలతో రైతులందరూ సంతోషంగా ఉండాలనే సంకల్పంతో ప్రతియేటా ఈ మహోత్తర కార్యక్రమాన్ని చేపట్టి భగవంతుడుని ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దైవ భక్తిని కలిగి ఉండాలని , దైవ చింతనతోనే మానసిక ప్రశాతంత లభిస్తుందన్నారు. పూజా కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయంలో పూజలు చసి



తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మహిళ భక్తులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి హారతులు ఇస్తూ పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అన్నధాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశం, మాజీ ఎంపిటీసీ బాలయ్య, బిఆర్ఎస్ గ్రామ పార్టీ అద్యక్షుడు గజేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు మాధవరెడ్డి, సురేష్‌రావు, వినోద్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, దేవునూరి శ్రీశైలం,రుక్మారెడ్డి, నర్సింహారెడ్డి, ఆర్.నాగేష్, చితంకుంట ఎల్లయ్య, యు.యాదయ్య, చాకలి మల్లేశం, వని అంజయ్య, మక్త ఆసీఫ్, అర్జున్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ దివ్య క్షేత్రంలో హీరో రాజేంద్రప్రసాద్ ప్రత్యేక పూజలు

శంకర్‌పల్లి, ప్రజాస్పూర్తి: కేంద్ర ప్రభుత్వం గతవారం హీరో డా. రాజేంద్రప్రసాద్ కు పద్మశ్రీ అవార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ స్వామి ఆహ్వానం మేరకు గురువారం శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో అష్టమ మోక్షపురిగా ప్రసిద్ధి చెందుతున్న చాళుక్య రాజుల కాలానికి చెందిన 11వ శతాబ్దపు శ్రీ రాజరాజేశ్వరి సమేత మహిమగల బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వర దివ్య క్షేత్రంలో టాలీవుడ్ సీనియర్ నటుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, డా. రాజేంద్రప్రసాద్ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి క్షేత్రపాలకుడు కాలభైరవుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సాయిశివ, ప్రమోద్, వీరేష్‌లు హీరోకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో గల గణేష్ మండపం వద్ద ఆలయ కమిటీ సభ్యులు హీరోను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. హీరో మాట్లాడుతూ పురాతన మరకత లింగాన్ని దర్శించుకోవడం ఎంతో ప్రశాంతతను ఇచ్చిందని, మరల కుటుంబ సభ్యులతో శివాలయానికి వస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వీడియో రావు, ఆలయ చైర్మన్ గోపాల్



రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, గౌరవ అధ్యక్షుడు సదానందం గౌడ్, డబ్బింగ్ ఆర్టిస్ట్ రైటర్ కృష్ణవేణి, కమిటీ సభ్యులు గోపాల్, హన్మంతు, గ్రామ సర్పంచ్ మల్లికార్జున్, ఉప సర్పంచ్ నర్సింలు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.



# మున్సిపల్ ఓట్ల లెక్కింపుకు సన్నద్ధం

* రేపు ఉదయం 8 గంటలకు ప్రారంభం
* పాల్వంచలో కౌంటింగ్ కేంద్రం పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ


ప్రజా స్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, మొత్తం రెండు రౌండ్లలో 60 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపడతామని తెలిపారు. ప్రతి టేబుల్‌కు ఒక సూపర్వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించామని పేర్కొన్నారు. అవసరమైన రిజర్వ్ సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి ఎన్నికల నియమావళి, ఓట్ల లెక్కింపు విధానం, అనుసరించాల్సిన జాగ్రత్తలపై సమగ్ర శిక్షణ అందించామని వెల్లడించారు. ఎన్నికల అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లను కట్టుదిట్టమైన భద్రత మధ్య సీల్ చేసి భద్రపరిచినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందు అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల సమక్షంలోనే స్ట్రాంగ్ రూమ్‌లను తెరవనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం సీసీటీవీ పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ జనరేటర్ సౌకర్యం, తాగునీరు, పారిశుద్ధ్య, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

* మూడు స్థాయిల భద్రతా ఏర్పాట్లు

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్ద మూడు స్థాయిల భద్రతా వలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతిపత్రాలు కలిగిన సిబ్బంది, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, అధీకృత మీడియా ప్రతినిధులను మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా బృందాలను మోహరించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రం పరిధిలో సెక్షన్ 163 బి అమల్లో ఉంటుందని తెలిపారు. ఐదుగురికిపైగా వ్యక్తులు గుమికూడరాదని, అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక సైబర్ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, పాల్వంచ డీఎస్పీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై సంగారెడ్డి పీఎస్‌లో కేసు నమోదు

సంగారెడ్డి: కాంగ్రెస్ సీనియర్ నేత, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల అధికారుల విధులకు ఆటంకం కలిగించారని ఎఫ్‌టీఎస్ టీమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో 223, 351, 352, 132, 329 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిపై జగ్గారెడ్డి స్పందించారు. ''సంగారెడ్డిలో దొంగ ఓట్లను అడ్డుకున్న కాంగ్రెస్ నేతపై సీఐ చేయిచేసుకున్నారు. మా నేతను కొట్టినందుకు సీఐని తిట్టాల్సి వచ్చింది. సీఐ శివకుమార్ బీఆర్ఎస్ అభ్యర్థికి సహకరించారు. ఎన్నికల




నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా చర్యలు ఉండాలి. నిన్న జరిగిన ఘటనలో తప్పు ఎవరిదనేది న్యాయస్థానంలో తేలుతుంది'' అని అన్నారు.

## సైబరాబాద్ లో జరిగిన అభివృద్ధి పనుల్లో పోలీసుల సేవలు చిరస్థాయిగా నిలిచిపోయాయి

* సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్



సైబరాబాద్, ప్రజాస్పూర్తి : సైబరాబాద్ లో నిర్మించిన ప్రతీ కట్టడంలో, జరిగిన ప్రతి అభివృద్ధి పనుల్లో సైబరాబాద్ పోలీసుల సేవలు చిరస్థాయిగా, అజరామరంగా నిలిచి పోయాయని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ అన్నారు. సైబరాబాద్ 24వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సైబరాబాద్ మెట్రోపాలిటన్ చట్టం ప్రకారం 2003లో స్థాపించిన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ ప్రాంతానికి సేవలందిస్తున్న ప్రముఖ అర్బన్ పోలీసింగ్ వ్యవస్థగా నిలిచిందని గుర్తుచేశారు. నాటి తొలి సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఎం. మహేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారని, ఈ 23 ఏళ్ల ప్రస్థానంలో ప్రాంత అభివృద్ధిలో పోలీసుల కష్టం, స్వేదం, త్యాగం కీలక పాత్ర పోషించాయన్నారు. జాతీయ పతాకం సాక్షిగా ప్రజా సేవకు మరింత అంకితభావంతో పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. సాంకేతికతను వినియోగిస్తూ ఆధునిక పోలీసింగ్‌లో సైబరాబాద్ కమిషనరేట్ దేశ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని సీపీ తెలిపారు. పునర్విభజనల నేపథ్యంలో, జనాభా, విస్తీర్ణం ఆధారంగా 'కోర్ అర్బన్ రీజన్'ని మూడు జోన్లుగా విభజించడం జరుగిందని, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌తో సమన్వయం పెంచుతూ పోలీస్ స్టేషన్లు, డివిజన్లను మున్సిపల్ వార్డులు, సర్కిళ్లకు అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు.సైబరాబాద్ పోలీసులు టెక్నాలజీ ఆధారిత కమాండ్ కంట్రోల్ సిస్టమ్స్, సైబర్ క్రైమ్ దర్యాప్తులు, ట్రాఫిక్ నిర్వహణ, కమ్యూనిటీ పోలీసింగ్, పబ్లిక్ -ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయన్నారు. సైబరాబాద్ పోలీసుల ప్రొఫెషనల్ నైపుణ్యాలకు జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయన్నారు. సైబరాబాద్ ప్రాంతం దేశ జీడీపీకి గణనీయంగా తోడ్పడుతున్నదని, ఐటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఫార్మా, బయోటెక్నాలజీ, ఎంఎస్ఎంఈలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ రంగాల వృద్ధికి పోలీసులు కల్పించే భద్రతే పునాది అని సీపీ స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్ నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు భద్రతా వ్యవస్థ బలోపేతం అయ్యిందని, 23 ఏళ్ల ప్రగతి ప్రతిబింబించే ప్రత్యేక వీడియోను ఆవిష్కరించినున్నట్లు తెలిపారు. అలాగే, సైబరాబాద్ ఇప్పటివరకు కమిషనరేట్‌లో సేవలందించిన మాజీ పోలీస్ కమిషనర్లను సన్మానించనున్నట్లు తెలిపారు.సైబర్ నేరాలు, పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయని సీపీ తెలిపారు. యుద్ధాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి, వ్యాపారం, పనుల కోసం వచ్చిన లక్షలాది మంది వలస కార్మికుల భద్రత, సంక్షేమం పోలీసుల బాధ్యత అని చెప్పారు. వారికి ఇన్సూరెన్స్, మెడికల్ కేర్ వంటి సదుపాయాలు నిబంధనల ప్రకారం అందించాల్సిందేనని, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సేవ, ప్రవర్తన ద్వారా ప్రజల విశ్వాసం గెలవాలని, 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు పోలీసులు తోడుగా ఉన్నారన్న భరోసా కల్పించాలని అన్నారు. సైబరాబాద్ లో ప్రత్యేక నేర విభాగాలు, సైబర్ ఎన్ ఫోర్స్ మెంట్ యూనిట్లు, ప్రజలతో భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా భద్రతను మరింతగా బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీపీ ఆఫీసు ప్రాంగణంలో సీపీ మొక్క నాటారు. అనంతరం ధీర, వీర, ధృవ, భీమ, రాఖీ, తేజ, మౌని, లైకా పోలీసు జాగిలాల గౌరవ వందనం సమర్పించాయి. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఫార్మేషన్ డే సందర్భంగా నార్సింగి సైకిల్ ట్రాక్ పై ప్రజలతో కలిసి పోలీసులు ప్రజలతో కలిసి సైక్లింగ్ చేశారు.

* సైబరాబాద్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో..

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేయగా, రాయదుర్గం పోలీసులు మణికొండ ప్రభుత్వ పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. జీడిమెట్ల, మేడ్చల్ పరిధిలో పోలీసులు ఆసుపత్రులు, ఆశ్రమాలను సందర్శించి రోగులకు, మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గంలో క్లీన్ స్వీప్ ఖాయం: కేటీఆర్



హైదరాబాద్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా.. ఎగిరేది మాత్రం గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్‌కుమార్‌రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచిందని.. కొందరు వెళ్లినా వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని తెలిపారు. శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని ధీమా వ్యక్తం చేశారు.

*** కాంగ్రెస్ అబద్ధాలు.. బీజేపీ శూన్యం**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతిలో వైకుంఠం చూపి అధికారం చేపట్టిందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని ఎద్దేవా చేశారు. వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలన్న నానుడిని గుర్తు చేస్తూ.. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే సుల్తాన్‌బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్‌కుమార్‌రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు.

## టీజీ సెట్–2026 హాల్ టికెట్లు విడుదల..

# 22 వరకూ డౌన్ లోడ్




హైదరాబాద్ : తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ సెట్ -2026)కు సంబంధించిన హాల్టికెట్లను విడుదల చేసినట్లు టీజీ సెట్ చీఫ్ కన్వీనర్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి ఎస్. కృష్ణ ఆదిత్య తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్సిట్యూషన్స్ సోసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీజీసెట్ -2026 ద్వారా టీజీఎస్ డబ్ల్యూఆర్, టీజీటీడబ్ల్యూఆర్, ఎంపీజేపీటీబీసీడబ్ల్యూఆర్, టీఆర్ఈఐ సొసైటీల్లో 5వ తరగతి, అలాగే టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్, టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ మరియు ఎంపీజేపీటీబీసీడబ్ల్యూఆర్ సొసైటీల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లను ఫిబ్రవరి 12 నుంచి ఫిబ్రవరి 22, 2026 వరకు డౌన్లోడ్ చేసుకోవచ్చని కృష్ణ ఆదిత్య పేర్కొన్నారు. ఈ మేరకు అభ్యర్థుల నమోదైన మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లను ముందుగానే డౌన్లోడ్ చేసుకొని, ప్రవేశ పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కృష్ణ ఆదిత్య సూచించారు.

# మోకిల తండా గ్రామ సర్పంచ్ శాంతమ్మ సస్పెన్షన్ ను ఎత్తివేయాలి

*** కలెక్టర్ కు భారతీయ గోర్ బంజారా పోరాట సమితి వినతి**

శంకర్ పల్లి, ప్రజాస్ఫూర్తి : మోకిల తండా గ్రామ సర్పంచ్ శాంతమ్మ సస్పెన్షన్ ను ఎత్తివేయాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి గురువారం కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. శంకర్‌పల్లి మండలం మోకిల తండా గ్రామ సర్పంచ్ శాంతమ్మని ఎటువంటి సముచిత కారణం లేకుండా సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం పట్ల భారతీయ గోర్ బంజారా పోరాట సమితి తీవ్రంగా ఖండించింది. శాంతమ్మ ఇటీవలే ఎన్నికై మూడు నెలలు కూడా పూర్తి కాకముందే పరిపాలనా



బాధ్యతలు నిర్వర్తించే అవకాశాన్ని ఇవ్వకుండా సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన (ఎస్టీ) మహిళగా ఎన్నికైన ప్రజాప్రతినిధిని ఈ విధంగా వ్యవహరించడం గిరిజన సమాజానికి అవమానకరంగా ఉందన్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర నిధుల వినియోగంపై సరైన విచారణ లేకుండానే ఈ చర్య తీసుకున్నారని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. అందువల్ల ఈ సస్పెన్షన్‌ను తక్షణం ఉపసంహరించి, ఆమెను మళ్లీ సర్పంచ్ హోదాలో కొనసాగించేలా తగిన ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా కలెక్టర్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ అంశంపై సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ తదితరులకు లిఖితపూర్వకంగా వినతి పత్రాలను అందజేస్తామని చెప్పారు. అవసరమైతే సంబంధిత జాతీయ మానవ హక్కుల సంఘం, ఎస్సీ,ఎస్టీ కమిషన్ తదితర అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లడానికి మా సమితి సిద్ధంగా ఉంది. కలెక్టర్ ఈ విషయాన్ని సమగ్రంగా పునఃపరిశీలించి, న్యాయపరమైన విచారణ చేసి, సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయవలసిందిగా రాష్ట్ర సమితి తరపున విజ్ఞప్తి చేశారు.



# సోషల్ మీడియాను పెడదోరణులకు వాడుకోవద్దు

*** విద్యార్థులకు సూచించిన టిఆర్ ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద**

*** ట్రపసా ఆధ్వర్యంలో పదవతరగతి విద్యార్థులకు కేరీర్ గైడెన్స్**

*** విద్యార్థులకు స్ఫూర్తి నిచ్చిన మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మాజీ డైరెక్టర్ బాలలత జీవితపాఠం**









ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్: స్ఫూర్తిదాయకమైన వ్యక్తుల జీవితాల కోసం తెలుసుకునేందుకు సోషల్ మీడియాను సద్వినియోగ చేసుకోవాలని విద్యార్థులకు టిఆర్ ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కెపి వివేకానంద సూచించారు. తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన అఫర్డబుల్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం (ట్రపసా) గ్రేటర్ కుత్బుల్లాపూర్ కమిటీ ఆధ్వర్యంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్సిట్యూషన్స్ సహాకారంతో పదవతరగతి విద్యార్థులకు కేరీర్ గైడెన్స్, మోటివేషనల్ తరగతిని గాజులరామారంలోని పద్మావతి గార్డెన్స్‌లో గురువారం జరిగింది. కార్యక్రమానికి ప్రముఖ కేరీర్ గైయిడ్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మాజీ డైరెక్టర్ బాలలత మల్లవరపుతో కలిసి ఎమ్మెల్యే వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతకు మాజీ ఐఏఎస్ అధికారిణి బాలలత స్ఫూర్తిదాయకమన్నారు. కృషి, పట్టుదలతో తాను రెండు సార్లు సివిల్స్ సాధించడం గొప్పవిషయమని తెలిపారు. సోషల్ మీడియాలో అనవసరమైన వాటికి కేటియించే సమయాన్ని బాలలతా లాంటి గొప్పవ్యక్తులు ఇచ్చే సలహాలు, సూచనలను చూడాలని, వినాలని విద్యార్థులకు సూచించారు.

*** ఉద్యోగాలను సృష్టించేవారిగా ఎదగాలిః బాలలత**

అన్నంతరం మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మాజీ డైరెక్టర్ , ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్సిట్యూషన్స్ డైరెక్టర్ బాలలత మల్లవరపు మాట్లాడుతూ యువత ఉద్యోగులు కాకుండా ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని విద్యార్థులను కోరారు. తాను చిన్నప్పుడే పోలియోకు గురైనప్పటికీ తన లక్ష్యం కోసం అహర్నిశలు శ్రమించానని తన జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లను విద్యార్థులకు వివరించారు. మనదేశం వందేళ్ళుగా అభివృద్ధి చెందుతున్న దేశంగానే చెప్పుకుంటున్నామని, అభివృద్ధి చెందిన దేశం ఎప్పుడవుతుందని ప్రశ్నించారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశం అని చెప్పుకోవాలంటే అది యువత చేతుల్లోనే ఉందనన్నారు. అందుకోసం యువతను తన వంతుగా సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. ఉన్నత లక్ష్యయాలతో యువత ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. పదవతరగతి భవిష్యత్తుకు మొదటి మెట్టుగా భావించి అత్యుత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థును కోరారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారిణి జమిని కుమారి, మాజీ కార్పోరేటర్ సురేష్ రెడ్డి, ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.రామేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి బిర్రు ఆంజనేయులు, జిల్లా నాయకులు గడ్డమీది బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, వీరన్న, శ్యాం, ట్రపసా గ్రేటర్ కుత్బుల్లాపూర్ చైర్మెన్ కోలా వెంకటేశ్ ముదిరాజ్, అధ్యక్షుడు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి జనార్థన్ దయాకర్, కోశాధికారి శ్రీశైలం, సీనియర్ కరస్పాండెంట్స్ బలరాం యాదవ్, నర్సింహులుగౌడ్, ప్రవీణ్‌రెడ్డి, మధుకుమార్, భూపాల్‌రెడ్డి, ధనిక్ భారత్ విద్యాసంస్థల ప్రతినిధులు అజయ్ విక్రం, గిరిబాబు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మార్చి నుంచి తనిఖీలు ముమ్మరం

**: హైడ్రా కమిషనర్ రంగనాథ్**




హైడ్రాబాద్ : 'నిప్పుతో ఊహించని ముప్పు ఉంటుంది. 30 సెకండ్ల సమయంలో మంటలు వ్యాపించే పరిస్థితి ఉంది. వచ్చేది వేసవి కాలం.. జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు. అగ్ని మాపక నిబంధనలన్నీ తూచా తప్పకుండా అందరూ పాటించాలి. వచ్చేది వేసవి కాలం.. మరింత ప్రమాదం పొంచి ఉంది. నగరంలో జరిగిన అనేక అగ్ని ప్రమాదాలను పరిశీలిస్తే నిబంధనలు పాటించకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అందుకే హైడ్రా అగ్ని ప్రమాదాలపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది' అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. అగ్ని ప్రమాదాలపై పాతబస్తీలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జుల్ఫికర్ తో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ పాల్గొని ప్రసంగించారు. తరచూ జరుగుతున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో జనవరి నెలాఖరులో తనిఖీలు చేపట్టి 9 షాపులను సీజ్ చేసినట్టు గుర్తు చేశారు. పలు వ్యాపార సంఘాల వినతుల మేరకు ఒక నెల రోజులు సమయం ఇచ్చామని.. మార్చి నెల రెండో వారం నుంచి తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. నిబంధనలు పాటించకపోతే ఆయా వ్యాపార సముదాయాలను, షాపులను సీజ్ చేస్తామని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు.

*** వేధించడం కాదు.. జాగ్రత్త పడడం..**

అగ్ని ప్రమాదాల నేపథ్యంలో హైడ్రా తనిఖీలు చేయడం.. నిబంధనలు పాటించకని వ్యాపార సుముదాయాలను సీజ్ చేయడాన్ని వేధించడంగా భావించవద్దని.. జాగ్రత్త పడడంగా పరిగణించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే తమకు సమాచారం ఇవ్వాలని వ్యాపార సంఘాల ప్రతినిధులతో పాటు.. పౌరులను కోరారు. ప్రజల భద్రతకు హైడ్రా పెద్ద పీట వేస్తుందన్నారు. 'వ్యాపారాలు ప్రశాంతంగా చేసుకోండి.. జాగ్రత్తలు పాటించండి.. మీతో పాటు.. మీ విలువైన వినియోగదారుల భద్రత గురించి ఆలోచించండి' అని హైడ్రా కమిషనర్ చెప్పారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన అగ్ని ప్రమాదాల వీడియోలు, రెస్క్యూ ఆపరేషన్లు, అగ్ని ప్రమాదాలకు గల కారణాలను వివరిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలకు ఎవరు బాధ్యులు అనేది గ్రహించాలని చార్మినార్ ఎమ్మెల్యే జల్ఫికర్ అన్నారు. ప్రమాదాలు జరగక ముందే అప్రమత్తమవ్వాలని సూచించారు. రంజాన్ మాసం వ్యాపారాలు జరుగుతాయని, స్టాకును భద్రపరిచినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరికి వారు చెక్ చేసుకోవాలని సూచించారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, ఆర్ఎఫ్వో జయప్రకాష్, డీఎఫ్ఓలు యజ్ఞ నారాయణ, వెంకన్న, విద్యుత్ విభాగం అధికారి ఏవీ రామారావు, సిటీ ప్లానర్ శ్రీనివాస్ రెడ్డితో పలు విభాగాలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నుమాయిష్ వాణిజ్య, సాంస్కృతిక వికాసానికి రోల్‌మోడల్: మంత్రి జూపల్లి కృష్ణారావు

హైడ్రాబాద్ : దేశ వ్యాప్తంగా ఖ్యాతి గడించిన నాంపల్లి నుమాయిష్ కేవలం ఒక వ్యాపార ప్రదర్శన మాత్రమే కాదని, అది మన రాష్ట్ర వాణిజ్య, సాంస్కృతిక వికాసానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనకు ఇప్పటి వరకు 20 లక్షలకు పైగా సందర్శకులు వచ్చారని, ఇది హైదరాబాద్‌పై ప్రజలకు ఉన్న మక్కువను, నుమాయిష్‌పై ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల చిన్న, మధ్య తరహా వ్యాపారులు ఉత్పత్తి చేసిన వస్తువులను విక్రయించుకునేందుకు మన నుమాయిష్ వేదిక కావడం సంతోషకరమన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాలకు కూడా ఎగ్జిబిషన్‌ను విస్తరించాలని సూచించారు.




1938లో స్థాపించిన ఈ నుమాయిష్ నాడు 100 స్టాళ్లతో మొదలై, నేడు 1050 స్టాళ్లకు చేరడం మన పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమని తెలిపారు. వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ ఆర్థికంగా ఎదగడంలో నుమాయిష్ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు.

**హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్..**

చార్మినార్, గోల్కొండ, బిర్యానీ తరహాలోనే 'నుమాయిష్' హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌లో అంతర్భాగమైంది. ఇది భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పే వేదిక. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఉన్న ఉత్పత్తులు ఇక్కడ కొలువుదీరడం వల్ల ఇది ఒక 'మినీ ఇండియా'ను తలపిస్తోంది. మన గంగా జమునా తెహజీబ్‌కు ఇది నిలువుటద్దమని ఆయన అన్నారు. వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయాన్ని తిరిగి సమాజానికి అందించడం గొప్ప విషయం. ముఖ్యంగా 19 విద్యా సంస్థలను నడుపుతూ, 30 వేల మంది విద్యార్థులకు, అందులోనూ మహిళా విద్యకు పెద్దపీట వేయడం ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న అద్భుతమైన కృషికి నిదర్శనమని వెల్లడించారు. నుమాయిష్ ద్వారా వచ్చిన ప్రతి రూపాయిని నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు వినియోగించడం అభినందనీయమన్నారు. నుమాయిష్‌లో సందర్శకులకు ఉత్తమ సేవలను అందించిన స్టాల్ నిర్వాహకులు, పోలీస్, ట్రాఫిక్, విద్యుత్, ఆర్ అండ్ బీ (R&B), ఇతర శాఖల అధికారులకు బహుమతులను ప్రదానం చేశారు. 86వ నుమాయిష్ మరింత విజయవంతంగా, అద్భుతంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ సుఖేష్ రెడ్డి, సెక్రటరీ బీఎన్. రాజేశ్వర్, ట్రెజరర్ ఎన్. సంజీవ్ కుమార్, జాయింట్ సెక్రటరీ టి. చంద్రశేఖర్, ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ అడ్వైజర్ పి. హరినాథ్ రెడ్డి, కన్వీనర్ బి. అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# నిఫా వైరస్ నుంచి కోలుకున్న నర్సు గుండెపోటుతో మృతి




పశ్చిమ బెంగాల్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రాణాంతక నిఫా వైరస్ బారినపడి కోలుకున్న ఓ నర్సు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర 24 పరగణాల జిల్లా బారాసాత్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిఫా వైరస్ నుంచి కోలుకున్నప్పటికీ.. వివిధ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నఆమె గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లో గత నెలలో ఇద్దరు ఆరోగ్య కార్యకర్తలకు నిఫా నిర్ధరణ అయ్యింది. పుర్బా బర్ధమాన్ జిల్లాకు చెందిన మహిళా నర్సు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. మరో వ్యక్తి కోలుకొని డిశ్చార్జి అయ్యారు. అయితే, మహిళా నర్సు నిఫా నుంచి కోలుకోగా.. ఇటీవల వెంటిలేటర్ సపోర్టును తొలగించారు. ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఆమె ఆసుపత్రిలోనే చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆరోగ్యం విషమించి ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆరోగ్య కార్యకర్తలకు నిఫా వైరస్ సోకిన నేపథ్యంలో అప్రమత్తమైన పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం.. ఇటీవల దాదాపు 196 మంది కాంటాక్టులకు పరీక్షలు నిర్వహించింది. వారికి నెగెటివ్‌గా తేలిందని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో పలు దేశాలు అప్రమత్తమయ్యాయి. చైనా, థాయ్‌లాండ్, నేపాల్, మలేషియా, తైవాన్ తదితర దేశాలు.. తమ దేశంలోకి వచ్చే భారతీయులకు 'నిఫా' స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టాయి. వీటిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పందించింది. భారత్‌లో నిఫా ప్రభావం తక్కువగానే ఉందని..దానితో ప్రమాదమేమీ లేదని స్పష్టం చేసింది.

## 3వ తరగతి నుంచే విద్యార్థులకు
# ఏఐ యాక్సెస్: ధర్మేంద్ర ప్రధాన్

ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో లానే విద్యారంగంలోను కృత్రిమ మేధ (ఏఐ) విస్తరిస్తుంది. ఈ కొత్త ఏఐ విధానాన్ని భారత్‌లోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి నుంచి అధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఈ కృత్రిమ మేధ అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం దిల్లీలో జరిగిన ఏఐ కాంక్లేవ్2026 సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐ (AI) రంగంలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ మేధో సామర్థ్యానికి లోటు లేదని, కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. భారత్‌లో గణనీయమైన యువశక్తి ఉందన్నారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు పూర్తిగా నిమగ్నమయ్యాయన్నారు. ప్రస్తుతం ఏఐ యాంత్రిక మేధస్సుతో పాటు మనుషుల భావోద్వేగాలను కూడా అర్థం



చేసుకుంటున్న విషయాన్ని ప్రస్తావించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గొప్ప విజయమని అభివర్ణించారు. ఈ సమావేశానికి ముందు దిల్లీలో ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన ఎడ్‌టెక్ ఏఐ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 10 వినూత్న భారతీయ ఎడ్‌టెక్ స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో ఆయన సమావేశమయ్యారు.

# అమర్‌నాథ్ యాత్రికులకు బీమా రూ.10 లక్షలకు పెంపు

అమర్‌నాథ్ యాత్రకు సంబంధించి ఆలయ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్టర్ చేసుకున్న యాత్రికులతోపాటు పూజారులు, అధికారులు తదితరుల ప్రమాద బీమా కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. ఈ ఏడాది యాత్రకు సంబంధించి తొలి పూజను జూన్ 29 జ్యేష్ఠ పౌర్ణమి రోజున నిర్వహించనున్నట్లు శ్రీఅమర్‌నాథ్ ఆలయ బోర్డు (ఎస్ఏఎస్‌బీ) ప్రకటించింది. యాత్ర అధికారిక ప్రారంభ తేదీని త్వరలో ఖరారు చేయనున్నట్లు తెలిపింది. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆధ్వర్యంలో బోర్డు



గురువారం సమావేశమైంది. యాత్రికుల ఆధ్యాత్మిక అనుభవాన్ని మెరుగుపరచడం, సౌకర్యాలు పెంచడం, భద్రతా చర్యలు బలోపేతం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించింది. పహల్గాం, బాల్తాల్ యాత్రా మార్గాల్లో టాయిలెట్ల ఏర్పాటుకు ప్రదేశాలను గుర్తించాలని సిన్హా ఆదేశించారు. అవసరమైన షెడ్లు, రెయిన్ షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య సదుపాయాలు, విపత్తు నిర్వహణ, భద్రతా ఏర్పాట్ల పెంపు తదితర అంశాలపై చర్చించారు. జమ్మూకశ్మీర్ ఆధ్యాత్మిక చరిత్రను చాటిచెప్పేలా, అమర్‌నాథ్ మంచులింగం విశిష్టతను వివరించేలా శ్రీనగర్, జమ్మూలలో లేజర్, సౌండ్ షోలు నిర్వహించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. జమ్మూకశ్మీర్‌లోని మంచు పర్వతాల్లో దాదాపు 13 వేల అడుగుల ఎత్తున వెలిసే మంచులింగ దర్శనం కోసం ఏటా అమర్‌నాథ్ యాత్ర నిర్వహిస్తారు. పహల్గాం లేదా బాల్తాల్ మీదుగా అక్కడికి చేరుకోవచ్చు. పహల్గాం మార్గంలో 48 కిలోమీటర్లు, బాల్తాల్ నుంచి 14 కిలోమీటర్ల దూరం నడవాల్సి ఉంటుంది.

# సైకిళ్లు, గుర్రాలపై వెళ్లే పరిస్థితి వస్తుంది..!: బాంబే హైకోర్టు

ముంబయిలో రహదారుల ఆక్రమణలపై బాంబే హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితి చాలా దారుణంగా ఉందని పేర్కొంది. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో నగరవాసులు సైకిళ్లు, గుర్రాలపై వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందేమోనని తెలిపింది. తమ పరిసరాల్లోని ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ ఓ పాఠశాల దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ హైకోర్టు ఈమేరకు వ్యాఖ్యలు చేసింది. ''ముంబయి రోడ్లపై ఆక్రమణల పరిస్థితి దారుణంగా ఉంది. ఇలాగే కొనసాగితే రాబోయే రెండు దశాబ్దాల్లో నగరం ఏమవుతుందో! అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయకుంటే భవిష్యత్తులో ప్రజలు సైకిళ్లు, గుర్రాలపై వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఈ నగరాన్ని ఆక్రమణదారులకు అప్పగిస్తోంది. ఈ కట్టడాలను తొలగించే ఉద్దేశం, ధైర్యం బీఎంసీకి లేనట్లు కనిపిస్తోంది.



వీటిపై చర్యలు తీసుకోలేనంత బలహీనంగా అధికార యంత్రాంగం ఉందా?'' అని హైకోర్టు ప్రశ్నించింది. పవయీ ప్రాంతంలో అక్రమార్కులకు నీళ్లు, టాయిలెట్ వంటి సౌకర్యాలు కల్పించడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఇటువంటి పనులతో ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నట్లు కనిపించడం లేదా? అని బీఎంసీని నిలదీసింది. ''నీళ్లు, టాయిలెట్ సౌకర్యాలు ఆపేస్తే వారు అక్కడినుంచి వెళ్లిపోతారు. కానీ, అవన్నీ సమకూర్చుతున్నారు'' అని తెలిపింది. ప్రభుత్వ రోడ్లపై అనధికార నిర్మాణాలు ఎలా పుట్టుకొస్తాయని ప్రశ్నిస్తూ.. సంబంధిత డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌ను శుక్రవారం తమముందు హాజరు కావాలని ఆదేశించింది. నగరవ్యాప్తంగా రోడ్ల పరిస్థితిని గమనించాలని హైకోర్టు తెలిపింది. ''ప్రతిచోటా రహదారులు ఒకటి, రెండు లేన్లకు పరిమితమయ్యాయి. ఆపై ట్రాఫిక్ సమస్య. కార్లు ఎటూ కదల్లేని పరిస్థితి ఉంటుంది. ఆ సమయంలో కార్ల కంటే మనిషి వేగంగా నడుస్తాడు. ఈ భూమ్మీద అందరికీ పరిమిత సమయమే ఉంది. పర్యావరణాన్ని, నగరాన్ని చక్కగా ఉంచడం పౌరుల బాధ్యత. భవిష్యత్తు తరాలకూ వాటి ప్రయోజనాలను అందాలి. అంతేకానీ.. మనమెంత నిర్లక్ష్యంగా ఉన్నామో వారు చెప్పుకొనే పరిస్థితి రాకూడదు'' అని హితవు పలికింది.

## 13న సేవా తీర్థ్, కర్తవ్య భవనాలు
# ప్రారంభించనున్న మోదీ

దిల్లీ: ప్రధానమంత్రి కార్యాలయం కొత్త భవనం సేవా తీర్థ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం 13న ప్రారంభించనున్నారు. కర్తవ్యభవన్ 1, 2లను కూడా మోదీ ప్రారంభించనున్నారని ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. ప్రస్తుతం సెంట్రల్ విస్టా ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, మంత్రిత్వ శాఖల భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో రోజువారీ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలో సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త భవనాల నిర్మాణం చేపట్టారు. గతంలో ప్రధాన మంత్రి కార్యాలయం, జాతీయ భద్రతా



మండలి సచివాలయం, క్యాబినెట్ సెక్రటేరియట్ వంటివన్నీ వేర్వేరు చోట్ల ఉన్నాయి. వాటిని ఒకే ప్రాంగణంలో ఏర్పాటుచేశారు. కర్తవ్యభవన్ 1, 2లోకి న్యాయ, రక్షణ, ఆర్థిక, వైద్యారోగ్యం, వ్యవసాయం వంటి కీలక మంత్రిత్వ శాఖలను తరలించనున్నారు. ఈ భవనాలను అత్యాధునిక సదుపాయాలతో నిర్మించినట్లు ప్రధాన మంత్రి కార్యాలయం వెల్లడించింది.

# డ్రోన్‌తో మాస్ కాపీయింగ్ గుట్టురట్టు.. 17 మంది టీచర్లపై కేసు

పరీక్షల సమయంలో అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించడం అధికారుల విధి. కానీ, వారి కనుసన్నల్లోనే యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ కొనసాగింది. ఓ డ్రోన్ కెమెరా ఫుటేజీతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. దీంతో 17 మంది ఉపాధ్యాయులపై కేసు నమోదైంది. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఈ ఘటన వెలుగుచూసింది. మహారాష్ట్రలో ఇటీవల 12వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్ద నిఘా కోసం అధికారులు డ్రోన్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే బీడ్ జిల్లా చౌశాలాలోని ఓ ఎగ్జామ్ సెంటర్‌లో పెద్దఎత్తున మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ఓ డ్రోన్ సాయంతో గుర్తించారు. 16 ఎగ్జామినేషన్ హాళ్లలోని సూపర్‌వైజర్లు.. కాపీయింగ్‌ను అడ్డుకోకుండా, విద్యార్థులు చూసి రాసేందుకు సాయపడుతున్నట్లు గమనించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వివేక్ జాన్సన్.. సంబంధిత సిబ్బందిపై



కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే పరీక్షా కేంద్రం చీఫ్ సహా 17 మంది ఉపాధ్యాయులపై కేసు నమోదైంది.



# లంబోర్గిని కారు ప్రమాదం కేసు..
## గంటల్లో వ్యాపారవేత్త కుమారుడికి బెయిల్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పాదచారులపైకి లంబోర్గిని కారు దూసుకెళ్లిన ఘటనలో ఓ వ్యాపారి కుమారుడు శివం మిశ్రాను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత నిందితుడిని అరెస్టు చేయగా.. కొన్ని గంటల్లోనే అతడికి బెయిల్ వచ్చింది. అతడిని తమ రిమాండ్‌కు అప్పగించాలని పోలీసులు కోరగా న్యాయస్థానం అందుకు నిరాకరించింది. కాన్పూర్‌లో ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివం మిశ్రా.. లంబోర్గిని కారులో వేగంగా వెళ్తుండగా వీఐపీ రోడ్‌లో అదుపుతప్పింది. ఈ క్రమంలో అక్కడున్న పాదచారులు, వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దర్యాప్తు చేపట్టిన అధికారులు.. నిర్లక్ష్యంగా, అతివేగంగా కారు నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తేల్చారు. అయితే, అంతకుముందు కేసు అనేక మలుపులు తిరిగింది. ఘటన సమయంలో శివం డ్రైవింగ్ చేయలేదని అతడి కుటుంబీకులు పేర్కొన్నారు. అయితే, ప్రత్యక్షసాక్షులతోపాటు ఆ సమయంలో తీసిన వీడియోలు, సీసీకెమెరాలను పరిశీలించిన పోలీసులు.. శివం డ్రైవింగ్ చేసినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్థానిక ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

# రఫేల్ జెట్ల కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్..!

త్రివిధ దళాల పోరాట సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు కేంద్రం ఓకే చెప్పింది. రూ.3.60 లక్షల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్‌తో అతిపెద్ద రక్షణ ఒప్పందానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 114 రఫేల్ యుద్ధవిమానాలను కొనుగోలు చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ కౌన్సిల్ ఆమోదించిందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ నెల 18న



భారత పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ కొనుగోలుకు రక్షణశాఖ నుంచి ఆమోదం లభించడం గమనార్హం. అయితే, ఏడాది చివరి నాటికి ఈ కొనుగోళ్ల కోసం ఇరు దేశాల మధ్య అధికారిక ఒప్పందం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ 114లో 88 సింగిల్ సీట్, 26 ట్విన్ సీట్ వేరియంట్లు భారత వాయుసేన (IAF) లో చేరి విధులు నిర్వర్తించనున్నాయి. అలాగే మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబ్లింగ్ వంటి వాటి కోసం ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్.. భారత్‌లోని ప్రయివేటు రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోనుంది. భారత వాయుసేన వద్ద ఇప్పటికే 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

# కుడికన్ను చూపు 85%కోల్పోయిన ఇమ్రాన్!

పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితి ఇటీవల చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. అయితే, రావల్పిండిలోని జైల్లో ఉన్న ఆయన పట్ల అక్కడి సిబ్బంది అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని సమాచారం. జైలు గదిలో సుదీర్ఘకాలంగా ఒంటరిగా ఉంచడంతో ఆయన కంటి చూపు కోల్పోతున్నారని, ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని తెలిసింది. ఈ మేరకు సుప్రీం కోర్టు నియమించిన న్యాయవాది పరిశీలనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన సుప్రీం కోర్టు, వెంటనే ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. మూడు, నాలుగు నెలల క్రితం వరకు తన కుడి కన్ను చూపు సరిగ్గానే ఉందని, ఆ తర్వాత మసకగా కనిపించడం మొదలైందని న్యాయవాదితో ఇమ్రాన్ ఖాన్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని జైలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. దాంతో పరిస్థితి విషమించి పూర్తిగా కంటిచూపు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని న్యాయవాదికి వివరించారు.

# ఈ జంతువులు ఇంట్లో పెరుగుతాయి..!



చిట్టి కుందేలు, బుల్లి ఏనుగు, చిన్ని ఎలుగుబంటి... జూలో ఉండాల్సిన జంతువుల జాబితాను చదువుతున్నట్లు ఉంది కదా! కానీ ఇవన్నీ ఇంట్లో మొక్కల్ని పెంచుకునే 'కోకో కాయిర్ ప్లాంటర్ పాట్స్'. ఈ రోజుల్లో ప్రతి వస్తువూ పర్యావరణహితంగా ఉండాలనుకునే ఇంటీరియర్ ప్రేమికులకోసం ప్రత్యేకంగా వీటిని చేతితో తయారుచేస్తున్నారు తయారీదారులు. ముందు లోపల చిన్న మట్టి కుండీని పెడతారు. తర్వాత కొబ్బరి పీచుని కావాల్సిన ఆకృతిలో మలిచి చింతగింజల గ్లూతో అతికించి, సహజ రంగులు వేసి ఈ ఎకో ఫ్రెండ్లీ పాట్స్‌ని తయారుచేస్తారు. ప్లాస్టిక్ పాట్స్‌కి ప్రత్యామ్నాయంగా వీటిని ఇండోర్, బాల్కనీ, కిచెన్ గార్డెన్, ఆఫీస్ డెస్క్‌ల్లోనూ ఉపయోగించుకోవచ్చు. మొక్కలకు నీటిని పోసినప్పుడు టేబుల్‌పై పడకుండా పీల్చుకోవడంతోపాటు మొక్క ఆరోగ్యంగా ఎదిగేందుకు తోడ్పడతాయి. వేర్లకు సహజంగా గాలి సరఫరా అయ్యేలా చేయడంతోపాటు మట్టి తేమను కోల్పోకుండా కాపాడతాయి. మరి ఆత్మీయుల పుట్టినరోజు, పెళ్లిరోజులకు బహుమతిగా ఇచ్చేయండి.







## మీరూ ఇలాంటి అమ్మాయేనా?



**కొంతమంది అమ్మాయిలు తమలో ఆత్మవిశ్వాసం లోపించిందని.. ఫలితంగా తామేమీ సాధించలేకపోతున్నామని.. ఏ పని చేయాలన్నా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందని బాధపడుతుంటారు. అలాంటి వారు ఆత్మవిశ్వాసం మెండుగా ఉండే వారిలో ఎలాంటి లక్షణాలుంటాయో తెలుసుకోగలిగితే.. వారి నుంచి స్ఫూర్తి పొందచ్చని చెబుతున్నారు నిపుణులు.**

**సొంతంగా నిర్ణయాలు..**

అమ్మాయిలు ఏం చదవాలి.. ఎక్కడ చదవాలి.. ఎలాంటి ఉద్యోగం చేయాలి.. మొదలైన అంశాల్లో కొన్ని కుటుంబాల్లో ఇప్పటికీ తుది నిర్ణయం పెద్దలదే అవుతుంటుంది. వారిది చిన్న వయసు కావడం వల్ల వారికేమీ తెలీదనే భావన కూడా ఇందుకు ఓ కారణం కావచ్చు. అయితే ఆత్మవిశ్వాసం ఉన్న అమ్మాయిల్లో తాము ఏం చేయాలో వారే నిర్ణయం తీసుకొనే సామర్థ్యం ఉంటుందట. అలాగని ఇతరుల అభిప్రాయాలకు విలువ ఇవ్వరని కాదు. ఎదుటివారి భావాలను గౌరవిస్తూనే.. తమ వాణిని బలంగా వినిపించే ప్రయత్నం చేస్తుంటారు. అలాగే తాము తీసుకొన్న నిర్ణయం సరైనదేనా? కాదా? అని ఆలోచించుకోవడంతో పాటు.. దానివల్ల జరిగే మంచిచెడులను కచ్చితంగా బేరీజు వేసుకోగలుగుతారు. ఫలితంగా తమ లక్ష్యం వైపు ప్రోత్సహించేలా కుటుంబ సభ్యులు, స్నేహితులనూ వీరు ఒప్పించగలుగుతారని నిపుణులు చెబుతున్నారు.

**'నో' చెప్పడం తెలుసు..!**

ఎవరైనా మనకు ఏదైనా పని అప్పగించినప్పుడు కొన్ని సందర్భాల్లో ఇష్టం లేకపోయినా.. మొహమాటానికి పోయి ఆ పనిని పూర్తి చేయాల్సి వస్తుంది. అలాంటి సందర్భాల్లో మేం ఈ పని చేయలేమని ధైర్యంగా చెప్పలేకపోతాం. కానీ ఆత్మవిశ్వాసం మెండుగా ఉండే ఈ తరం అమ్మాయిలు తమకు నచ్చని పనులు 'చెయ్యం' అని చెప్పడానికి ఏమాత్రం వెనుకాడరట! అలాగే ఆ పనిని తాము ఎందుకు చేయమంటున్నారో దానికి గల కారణాలను సైతం వారు చెప్పడానికి మొహమాటపడరట!

**అసూయ ఉండదు..**

ఇతరులు తమకంటే కొన్ని విషయాల్లో మెరుగ్గా ఉన్నా లేదా వారు చేస్తున్న పనిలో విజయం సాధించినా వారిని చూసి అసూయపడే వారు చాలామందే ఉంటారు. కానీ ఆత్మవిశ్వాసం ఉన్న వారు ఇతరులను చూసి ఇలా అసూయపడరట. తమ పనేదో తాము చూసుకొని ముందుకు సాగుతుంటారే తప్ప.. ఇతరుల గురించి ప్రతిదీ పట్టించుకోవాలన్న ఆసక్తి వారికుండదు. ఫలితంగా తాము చేస్తున్న పని పైనే పూర్తి శ్రద్ధ పెట్టి, సాధించాలనుకొన్న లక్ష్యాల్ని చేరుకోగలుగుతారు. అంతేకాదు.. అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడానికీ వీరు వెనకాడరట. అలాగే ఇతరులను ప్రోత్సహించడంలోనూ వీరు ముందుంటారు అంటున్నారు నిపుణులు. మరి మీరూ అంతేనా?

## మైదాకు బదులుగా ఇవి..!

**మైదా పిండి.. మనం తీసుకునే ఆహారంలో ఎక్కువగా కనిపించే పదార్థం. బ్రెడ్, సమోసాలు, కేకులు, బిస్కట్లు, బోండాలు.. ఇలా చెప్పకుంటూ పోతే చాలా ఆహార పదార్థాల్లో మైదా కనిపిస్తుంటుంది. అయితే ఈ పిండిలో శరీరానికి కావాల్సిన పోషకాలు తక్కువ మోతాదులో ఉంటాయి. అలాగే రక్తంలోని చక్కెర స్థాయులను అమాంతం పెంచేస్తుంది. అయితే రుచిగా ఉంటుందనో, తేలిగ్గా వంట పూర్తవుతుందనో చాలామంది ఈ పిండిని వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో మైదాకు బదులుగా కొన్ని పిండి పదార్థాలను ఆహారంలో చేర్చుకోవచ్చంటున్నారు నిపుణులు. ఫలితంగా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చంటున్నారు.**




**రాగి పిండి**

ఇటీవలి కాలంలో ఆరోగ్యానికి సంబంధించి జాగ్రత్తలు తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది. ఇందులో భాగంగా చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇందులో రాగులు ముందు వరుసలో ఉంటాయి. రాగుల్లో క్యాల్షియం, ఐరన్‌తో పాటు అమైనో అమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి మేలు చేసేవే. రాగి పిండితో రోటీల దగ్గర్నుంచీ లడ్డూల వరకు పలు వంటకాలు చేసుకోవచ్చు. అంతేకాదు.. మైదా పిండి లాగా సాగే గుణం కూడా దీనికి ఉండదు. ఇందులోని క్యాల్షియం ఎముకల దృఢత్వానికి ఉపయోగపడుతుంది. పిల్లల దగ్గర్నుంచీ పెద్దల వరకు ప్రతి ఒక్కరూ నిస్సంకోచంగా రాగి పిండిని తీసుకోవచ్చంటున్నారు నిపుణులు.

**ఓట్స్ పిండి**

బరువు తగ్గాలనుకునే వారు చాలామంది ఓట్స్‌ని ఆహారంలో భాగం చేసుకుంటారు. ఇందులో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. మాంసకృత్తులు, పీచు అధిక మొత్తంలో ఉంటాయి. పీచు వల్ల తిన్న వెంటనే కడుపు నిండిన భావన కలుగుతుంది. అలాగే శరీరానికి కావాల్సిన ఇతర పోషకాలు కూడా ఇందులో మెండుగా ఉంటాయి. ఈ క్రమంలోనే మైదాకు బదులుగా ఓట్స్ పిండిని కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఓట్స్ పిండితో ప్యాన్‌కేక్స్, రోటీలు, కుకీస్, మఫిన్స్‌తో పాటు మసాలా వడలు.. మొదలైనవి కూడా చేసుకోవచ్చు.




**జొన్న పిండి**

జొన్నల్లో శరీరానికి కావాల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. ఒకప్పుడు వీటిని ప్రధాన ఆహారంగా తీసుకునేవారు. బియ్యం వినియోగం పెరగడంతో వీటి ప్రాధాన్యం తగ్గింది. అయితే ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునేవారు జొన్నలకు ఇటీవల కాలంలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది జీర్ణశక్తిని మెరుగుపరచడంతో పాటు శరీర బరువుని అదుపులో పెట్టుకోవడానికి ఉపయోగపడుతుంది. జొన్న పిండితో రొట్టెలతో పాటు దోశలు, ఉప్మా, లడ్డూలు, మఫిన్లు, మురుకులు.. మొదలైనవి కూడా చేసుకోవచ్చు. మైదా పిండికి బదులుగా ఆహారంలో జొన్న పిండిని భాగం చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందచ్చంటున్నారు నిపుణులు.

**గోధుమ పిండి**

రిఫైన్డ్ గోధుమల నుంచి మైదా పిండిని తయారు చేస్తారు. ఈ క్రమంలో పలు రసాయనాలనూ కలుపుతారు. అందువల్లే ఇది తెలుపు రంగులో ఉంటుంది. అయితే మైదా కంటే గోధుమ పిండితో చేసిన వంటకాలు మంచివంటున్నారు నిపుణులు. భారతీయ వంటకాల్లో ఎప్పట్నుంచో గోధుమ పిండికి ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో ఫైబర్, బి విటమిన్లు.. మొదలైన పోషకాలు ఎక్కువగా ఉంటాయి.





## శ్రీశైల మహాక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు..

# రావణ వాహనంపై స్వామి దర్శనం

శ్రీశైలం ఆలయం: నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన గురువారం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వారు రావణ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే రాజశేఖర్ స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తజనసంద్రంగా మారిన శ్రీశైల క్షేత్రం శివనామస్మరణంతో మారుమోగుతోంది.













Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.